క్లుప్తంగా

రైతుబజారు స్టాళ్లకు డ్రా



డ్రా తీసి టోకెన్ అందిస్తున్న రైతుబజార్ ఎస్టేట్ అధికారి కొండబాబు

సీతమ్మధార : సీతమ్మధార రైతుబజారులోని రైతుల స్టాళ్లకు సోమవారం డ్రా తీశారు. ఉదయం రైతులు 89 మందికి 66 స్టాళ్లకు, సాయంత్రం రైతులు 55 మందికి 66 స్టాళ్లకు ఎస్టేట్ అధికారి కొండబాబు డ్రా తీసి టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు పది రోజులకు స్టాళ్లకు డ్రా తీసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

బాపూజీనగర్‌లో అంధకారం



బాపూజీనగర్‌లో వెలగని విద్యుత్ స్తంభం

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు 104 ఏరియా బాపూజీనగర్‌లో 44బీ/2 నుంచి 44ఏ/2 వరకు గల విద్యుత్ స్తంభాలకు లైట్లు వారం రోజులుగా పనిచేయడం లేదు. దీంతో చీకటి పడితే పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. సిబ్బందికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ విభాగాధికారులు స్పందించి విద్యుత్ లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎన్ఎంసీ హైస్కూల్‌లో లైబ్రరీ ప్రారంభం



లైబ్రరీ ప్రారంభంలో మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, తదితరులు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు పీఅండ్‌టీ కాలనీలోని ఎన్ఎంసీ హైస్కూల్‌లో లైబ్రరీని మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు సోమవారం ప్రారంభించారు. లైబ్రరీ ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ హ్యూమన్ వాల్యూస్ సంస్థ (ఐఏహెచ్‌వీ) రీడ్ లైబ్రరీ ప్రాజెక్టు స్పాన్సర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచి పుస్తకాలు చదవడం అలవరచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఉపాధ్యాయురాలు అరుణకుమారి మాట్లాడుతూ ఐఏహెచ్‌వీ సౌజన్యంతో భారతదేశంలో 170 పాఠశాలల్లో లైబ్రరీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోసిపోయిన తహసీల్దార్ కార్యాలయం



ఖాళీగా ఉన్న వీఆర్వో గది

సీతమ్మధార : అధికారులు, సిబ్బంది లేక సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయం సోమవారం వెలవెలబోయింది. 'స్పందన' కార్యక్రమానికి అధికారులు, తహసీల్దార్, డీటీ, ఆర్ఐ, వీఆర్వోలు రాకపోవడంతో వినతులు ఇచ్చేందుకు ప్రజలు నిరీక్షించారు. ఉదయం 11.30 గంటల వరకు వీఆర్వోలు, ఆర్ఐ గదులు ఖాళీగా ఉన్నాయి. చివరకి హెల్ప్ డెస్క్‌లో అటెండర్ విధులు నిర్వహించారు. ప్రజలు వేచి చూసి తిరిగి వెళ్లిపోయారు. వినతులు స్వీకరించేందుకు ఎవరూ లేకపోవడంతో కార్యాలయం బోసిపోయింది.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనా
- కలెక్టర్ మల్లికార్జునతో కలిసి పోలింగ్ బూత్‌ల పరిశీలన



గురుద్వార్ దరి వసంత బాల స్కూల్‌లో పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్‌మీనా, కలెక్టర్ మల్లికార్జున, ఇతర అధికారులు

సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిధిలోని పలు పోలింగ్ స్టేషన్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా సోమవారం పరిశీలించారు. జీవీఎంసీ 24వ వార్డు గురుద్వార్ దరి వసంత బాల స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునతో కలిసి ఆయన పరిశీలించారు. అక్కడ కల్పించిన వసతులపై ఆరా తీశారు. అన్ని చోట్ల వికలాంగులు సులభంగా పోలింగ్ కేంద్రం లోపలకు చేరుకునేందుకు అనువుగా ర్యాంపులు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సౌకర్యం, తాగునీరు, ఫ్యాన్లు, ఇతర వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఓటర్లకు ఏమాత్రం ఇబ్బంది కలగకుండా వసతులు కల్పించాలని, పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయనతోపాటు ప్రత్యేక ఉప కలెక్టర్ డి.అఖిల, తహసీల్దార్ శ్రీరామమూర్తి, బీఎల్వోలు, ఇతర అధికారులు ఉన్నారు.

వినతుల తక్షణ పరిష్కారానికి చర్యలు

కంచరపాలెం: 'జగనన్నకు చెబుదాం'లో వచ్చిన వినతులను తక్షణం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. జ్ఞానాపురం జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీదారుల నుంచి ఆయన వినతులను స్వీకరించారు. వాటిని ఆయా విభాగాల అధికారులకు అందజేసి, సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ కార్యక్రమంలో 4 వినతులు అందాయని తెలిపారు. వినతుల్లో టౌన్ ప్లానింగ్ విభాగానికి 2, యూసీడీ విభాగానికి 1, ఇంజినీరింగ్ విభాగానికి 1 చొప్పున ఉన్నాయన్నారు.

అధికారులతో సమీక్ష

సాయంత్రం సచివాలయ సిబ్బంది, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలపై వెంటనే స్పందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సూపరింటెండెంట్-1 టి.ఎస్.ఎస్.రాజు, సూపరింటెండెంట్-2 ఆర్.వి.రాజు, ఆర్వో బాబురావు, రాజ్యలక్ష్మి, ఈఈలు టి.ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, డీఈ భరణికుమార్, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారుల సమస్యలు వింటున్న జెడ్సీ కృష్ణ

సభ్యుల సహకారంతో పార్కు అభివృద్ధి



వైశాఖి స్పోర్ట్స్ పార్కు సమావేశంలో మాట్లాడుతున్న వరప్రసాద్

మురళీనగర్: సభ్యులందరి సహకారంతో మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కును నగరంలోనే ఆదర్శ పార్కుగా తీర్చిదిద్దామని పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ అన్నారు. ఆదివారం రాత్రి నిర్వహించిన వైశాఖి స్పోర్ట్స్ పార్కు జీవిత కాల సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్క్ ఆవరణలో బుద్ధుడి విగ్రహం ఏర్పాటు, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి తదితర అంశాల గురించి వివరించారు. సభ్యులకు బహుమతులు, టీ షర్ట్ పంపిణీ చేశారు. జీవిత కాల సభ్యులు మరణిస్తే, వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉచితంగా జీవిత కాల సభ్యత్వం ఇవ్వాలని తీర్మానించారు. కార్యక్రమంలో 350 మంది జీవితకాల సభ్యులు పాల్గొని, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో కార్యదర్శి పాట్నూరు నాగరాజు, కూర్మారావు, బోయపాటి శ్రీనివాస్, పల్లా చంద్రమౌళి, కాంతారావు, కనకరాజు, ఎం.వి.రెడ్డి, విశ్వనాథ రాజు తదితరులు పాల్గొన్నారు.

15న జాబ్‌మేళా

కంచరపాలెం : స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 15న గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి నిట్టల శ్యామ్ సుందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హీరో మోటో, డైకిన్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 100 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని తెలిపారు. ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, డిప్లమో, ఎంబీఏ ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. విశాఖపట్నంలో ఉద్యోగం చేయాలని, నెలకు రూ.13,450 నుంచి రూ.18,350 జీతం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. కంచరపాలెంలో గల జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో గురువారం ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం



సమావేశంలో పాల్గొన్న మానవసేవే మాధవసేవ కార్యవర్గం, కుటుంబ సభ్యులు

మురళీనగర్: సామాజిక బాధ్యతలో భాగంగా సేవా కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు మానవసేవే మాధవసేవ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ అన్నారు. అసోసియేషన్ వనసమారాధనలో భాగంగా సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదరికంలో ఉన్న కుటుంబాలను ఆదుకునేందుకు తమ సంఘం ద్వారా సాయం అందించామన్నారు. కార్యక్రమంలో సభ్యులు తమ కుటుంబ సభ్యులతో పాల్గొని సందడి చేశారు. పలువురిని సత్కరించారు. ప్రతి నెలా నిర్వహించే సేవా కార్యక్రమాల వివరాలను సంయుక్త కార్యదర్శి పి.సంతోష్ కుమార్ వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు డి.ప్రసాద్ రాజు, కార్యదర్శి సీతారామకృష్ణ, కోశాధికారి కేవీ వర్మ, ఉపాధ్యక్షుడు ఎం.కోదండరామ్, పి.సతీష్‌కుమార్, నిర్వహణ కార్యదర్శి కె.భవానిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక దొంగ కోసం నగరంలో గాలింపు

సీతమ్మధార : నగరంలోని పలు ప్రాంతాల్లో జరిగిన చోరీలపై ద్వారకా క్రైం పోలీసులు సోమవారం గురుద్వార్, సీతంపేట, బాలయ్యశాస్త్రి లే అవుట్‌తోపాటు ఇతర ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల్లో వున్న సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలించారు. ద్వారకా క్రైం సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో క్రైం ఎస్ఐలు, సిబ్బంది పలు ప్రాంతాలకు వెళ్లి ఆరా తీశారు. కర్ణాటకకు చెందిన మోహన్‌కృష్ణ గాజువాక, సీతంపేట, మధురనగర్, పీఎంపాలెం ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. అతని ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. మోహన్‌కృష్ణ టోపీ, మాస్క్ ధరించి కనిపించకుండా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఒక ప్రాంతంలో దొంగతనాలకు పాల్పడితే రెండు నెలల వరకు వేరే ప్రాంతాలకు వెళ్లిపోతున్నాడని, తాళం వేసి వున్న ఇళ్లే లక్ష్యంగా పట్టపగలే చోరీలకు పాల్పడుతున్నాడని పోలీసులు తెలిపారు. మధురనగర్‌లో దొంగతనానికి పాల్పడిన రోజు నిందితుడు ఆటో ఎక్కినట్లు సీసీ కెమెరాలో రికార్డయిందని, అన్ని కెమెరాల పుటేజీ పరిశీలిస్తున్నామని తెలిపారు. త్వరలోనే దొంగను పట్టుకుంటామని పేర్కొన్నారు.

ఆంధ్రా ఫ్యాషన్ వీక్‌లో తల్లీకూతుళ్లకు అవార్డులు



అవార్డులు గెలుపొందిన తల్లీకూతుళ్లు ప్రసన్న రేణుక, తన్వి రిషిక

తాటిచెట్లపాలెం: బల్ల వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్ర ఫ్యాషన్ వీక్ – 2024 సీజన్ 1 పోటీల్లో తల్లీకూతుళ్లు అవార్డులను గెలుపొందారు. నగరంలోని పోర్టు కళావాణి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో మిసెస్ ఎవర్‌గ్రీన్ అవార్డును ప్రసన్న రేణుక, ప్రిన్సెస్ కేటగిరీలో ఆమె కుమార్తె తన్వి రిషిక అవార్డులను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా రేణుక మాట్లాడుతూ అవార్డును సొంతం చేసుకున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రయాణంలో తన భర్త, మాజీ నేవీ అధికారి సురేష్ కుమార్ అందించిన ప్రోత్సాహం మరువలేనిదన్నారు.

ఇంధన రంగంలో అవకాశాలపై అవగాహన



కళాశాల ప్రతినిధులతో స్టీఫెన్ పీటర్

సీతమ్మధార: ఇంధనరంగ భవిష్యత్తు, సంబంధిత రంగంలో అవకాశాలపై డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ సీనియర్ ఎనర్జీ స్పెషలిస్ట్ స్టీఫెన్ పీటర్స్ మాట్లాడుతూ ఇంధన రంగంలో ఆవిష్కరణలు, సవాళ్లను అన్వేషించడమే ఈ ఇంటరాక్టివ్ సెషన్ లక్ష్యమన్నారు. స్థిరమైన పరిష్కారాలు, సాంకేతిక పురోగతిపై దృష్టి సారించాలని సూచించారు. సౌర, జల, వాయు తదితర పునరుత్పాదక ఇంధన వనరుల పాత్రను నొక్కి చెప్పారు. కార్యక్రమంలో సెక్రటరీ, కరస్పాండెంట్ జి.మధు కుమార్, ప్రొఫెసర్ డి.దీపక్ చౌదరి, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఆనంద్, ఈఈఈ విభాగాధిపతి వి.రాధాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముస్లిం వధువు వివాహానికి సొసైటీ సహకారం



నవ దంపతులతో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: పేద ముస్లిం వధువు వివాహానికి ముస్లిం వెల్ఫేర్ సొసైటీ సంపూర్ణ సహకారం అందించింది. మునగపాక గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబంలోని యువతికి రైల్వే న్యూకాలనీలోని సింకా గ్రాండ్ హోటల్‌లో సోమవారం ఘనంగా వివాహం జరిపించింది. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు హైదర్ ఆలీ సింకా మాట్లాడుతూ పేద ముస్లిం కుటుంబాలకు వెల్ఫేర్ సొసైటీ అండగా నిలుస్తుందన్నారు. ఈ వివాహానికి వేదిక, విందు తదితర ఖర్చులన్నీ సొసైటీయే భరించిందని చెప్పారు. అంతేకాకుండా పలువురు దాతలు కూడా నూతన వధూవరులకు ఆర్థిక సహాయం అందిస్తున్నారని తెలిపారు. గౌరవ అధ్యక్షుడు అబ్దుల్ మునీర్ మాట్లాడుతూ నిరుపేద ముస్లిం కుటుంబాలకు చెందిన వారికి ఏ అవసరమైనా, తమను సంప్రదిస్తే సొసైటీ తరఫున అన్ని విధాలా ఆదుకుంటామన్నారు.

ముస్లింలకు ప్రాతినిధ్యం కల్పించాలి

సొసైటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ముస్లింలకు ప్రాతినిధ్యం కల్పించి సీట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు అబ్బాస్ హుస్సేన్, సయ్యద్ అమీర్ జాన్, మహబూబ్ అలీఖాన్, షేక్ అహ్మద్‌వలీ, ఆయా పార్టీలకు చెందిన నాయకులు ఐ.హెచ్.ఫరూఖీ, షబీరా బేగం, ఎండీ నజీర్, ఎండీ షరీఫ్, లతీఫ్, కేవీ బాబా తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

చైన్ స్నాచింగ్ కేసులో ముగ్గురి అరెస్ట్

- ఆటోలో వెంబడించి వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ
- సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితుల గుర్తింపు



చిరుపాటి రాజు



చేపల ఆనంద్



కంబాల శ్రీ రాజు

అక్కిరెడ్డిపాలెం: వాకింగ్ చేస్తున్న వృద్ధురాలిని ఆటోలో వెంబడించి, ఆమె మెడలోని బంగారు గొలుసు, నగదు చోరీ చేసిన ముగ్గురు యువకులను గాజువాక పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఆ బంగారం కొనుగోలు చేసిన వ్యాపారిని కూడా అరెస్ట్ చేశారు. గాజువాక క్రైం సీఐ కె.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీహరిపురానికి చెందిన షియా ప్రసాద్‌సింగ్ (84) గత నెల 24న గొందేశిపాలెంలో వాకింగ్ చేస్తుండగా.. పెదగంట్యాడకు చెందిన చేపల ఆనంద్, కంబాల శ్రీ రాజు, హనుమంతవాకకు చెందిన చిరుపాటి రాజు ఆటోలో వెంబడించి ఆమె మెడలోని తులం బంగారు చైన్‌ను తెంచుకుపోవడంతోపాటు, ఆమె వద్ద గల నగదును కూడా లాక్కుని పరారయ్యారు. ఆమె వెంటనే గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి.. సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా దొంగల ఆచూకీని కనిపెట్టారు. విచారణలో ముగ్గురూ నేరం చేసినట్లు తేలడంతో, సోమవారం వారిని అరెస్ట్ చేసి, బంగారం, నగదుతో పాటు మద్యం సీసాలు, ఇనుప రాడ్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన బంగారాన్ని కొనుగోలు చేసిన దిగువ జాలారిపేటకు చెందిన సీహెచ్ ఎల్లాజీ (35)ని కూడా అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. సీఐ మాట్లాడుతూ క్రైం డీసీపీ వెంకటరత్నం, క్రైం ఏడీసీపీ గంగాధరం, జోన్-2 క్రైం ఏసీపీ సునీల్ ఆధ్వర్యంలో ఎస్ఐ మన్మథరావు, ఏఎస్ఐ రవి, కానిస్టేబుళ్లు కేసు దర్యాప్తు చేసి, నిందితులను గుర్తించగలిగారన్నారు. నిందితుల్లో ఒకరు పాత నేరస్తుడని తెలిపారు. ఆటో నంబర్ ప్లేట్ సరిగ్గా లేకపోయినా, పాతకేసును తిరగదోడి నిందితులను గుర్తించారని, సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా వారిని పట్టుకోగలిగారని తెలియజేశారు.

ప్రజా రవాణాతో పర్యావరణ పరిరక్షణ



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేర్కొన్నారు. ఆమె తమ క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం తన చాంబర్‌లో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(గ్రీవెన్స్)కు హాజరయ్యారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై వచ్చారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎకో-వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో నగరంలో పర్యావరణ పరిరక్షణకు జీవీఎంసీ అనేక చర్యలు చేపడుతుందన్నారు. ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

విద్యార్థులకు హాల్ టికెట్ల పంపిణీ



హాల్ టికెట్లు తీసుకున్న విద్యార్థులతో హెచ్ఎం, తదితరులు

సీతమ్మధార : ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షలకు హాల్ టికెట్లను ఎన్ఎంసీహెచ్ ప్లస్ విద్యార్థులకు హెచ్ఎం రాంప్రసాద్ సోమవారం అందజేశారు. గతంలో ఎన్ఎంసీహెచ్ 6 నుంచి 10వ తరగతి వరకు ఉండేది. 2023 సెప్టెంబర్ నుంచి ఎన్ఎంసీహెచ్ స్కూల్‌లో ప్లస్ టూ క్లాసులు ప్రారంభించారు. మొదటిసారి పరీక్షలకు 18 మంది హాజరవుతున్నట్లు హెచ్ఎం తెలిపారు.

పారిశ్రామిక సమ్మె విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు జగ్గునాయుడు

మల్కాపురం: దేశవ్యాప్తంగా ఈ నెల 16న జరగబోవు పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. సమ్మెను పురస్కరించుకుని ఇండస్ట్రియల్ ఏరియా పరిధి అఖిల పక్షాల కార్మిక సంఘాల నాయకులు సోమవారం హెచ్‌పీసీఎల్ సీ గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జగ్గునాయుడు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ సర్కార్ 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను వివిధ పరిశ్రమల యాజమాన్యాలకు అనుకూలంగా,నాలుగు లేబర్ కోడ్‌గా మార్చి వేసిందని ఆరోపించారు.ఈ లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనేక మంది త్యాగమూర్తుల ఫలం విశాఖ స్టీల్‌ప్లాంట్ అని, ఆ త్యాగమూర్తుల త్యాగాలను మోదీ సర్కార్ తుంగలోకి తొక్కి, ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తోందన్నారు. ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి నక్క లక్ష్మణరావుయాదవ్,ఏఐటీయూసీ నాయకుడు గుండాల రాంబాబులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల లక్షలాది మంది జీవితాల్లో చీకటి కమ్ముకుందన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈ నెల 16న చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

విభజన హామీలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం

కూర్మన్నపాలెం: రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి, ప్రజలను మోసం చేసిన కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1096వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ప్లాంట్‌లోని బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ కార్మికులతో పాటు గాజువాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు చెల్లుబోయిన నాయుడు, నాయకులు మాట్లాడుతూ రాష్ట్రాన్ని నష్టాల్లోకి నెట్టిన కేంద్రప్రభుత్వం వైఖరి మార్చుకోవాలన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా కాంగ్రెస్ మద్దతు తెలుపుతుందన్నారు.

14న అక్షరాభ్యాసాలు

కొమ్మాది: శ్రీ అష్టలక్ష్మి దేవాలయంలో ఈ నెల 14న బుధవారం శ్రీ పంచమి మహాపర్వదినాన్ని పురస్కరించుకుని విద్యాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు, చిన్నారులచే సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించనున్నామని ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి తెలిపారు. మాఘమాసంలో శ్రీ పంచమి నాడు అక్షరాభ్యాసం జరిపితే అఖండిత విద్యాప్రాప్తి కలుగుతుందని తెలిపారు. అక్షరాభ్యాసం చేయించుకోవాలనుకునే వారు ముందుగా ఆలయంలో సంప్రదించాలని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ధ్యాన సంస్మరణోత్సవం

పెదగంట్యాడ: పత్రీజీ పిరమిడ్ స్పిరిట్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెదగంట్యాడలోని అహింస పిరమిడ్ ధ్యాన కేంద్రంలో బ్రహ్మ విద్వారిష్ఠ తాడి వీర జగదీశ్వరి తృతీయ ధ్యాన సంస్మరణోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాస్టర్స్ పాల్గొని ఆమె సేవలను కొనియాడారు. గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో ధ్యానం, శాకాహార విశిష్టత కోసం ఆమె చేసిన కృషిని వివరించారు. దేశ విదేశాలతో పాటు ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల్లో ధ్యానం ప్రాముఖ్యతను వివరిస్తూ ఎంతోమందిని ధ్యానులుగా తీర్చిదిద్దిన ఘనత ఆమెదేనన్నారు. మాడుగులలో విశ్వశాంతి పిరమిడ్ శక్తి క్షేత్రాన్ని నిర్మించారన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మీసాల శివగణేశ్వరరావు, సీనియర్ మాస్టర్స్ లక్ష్మీరాజ్యం, వనిత, లక్ష్మీసుబ్బారావు, అప్పారావు, మూర్తి, బాలాజీ, పద్మావతి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.అర్చకుడు రఘునాథ్ తదితరులు ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం... ఆదివారం సాయంత్రం రైల్వే స్టేషన్ 1వ నంబర్ ప్లాట్‌ఫారం పిల్లర్ నంబరు 20 వద్ద ట్రాక్‌పై ఓ వ్యక్తి మృతదేహం గుర్తించారు. జీఆర్పీ సీఐ ధనుంజయనాయుడు ఆదేశాలతో ఎస్ఐ బాలాజీరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని గుర్తించిన వారు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గల గవర్నమెంట్ రైల్వే పోలీసులకు స్వయంగా, లేదా 96661 22722, 94406 27547లో తెలియజేయాలని కోరారు.